# స్మశాన స్వర్ణం

మూలం : అన్నా భావు సాఠె
అనువాదం : డా.దేవరాజు మహారాజు

చుట్టు పక్కల గ్రామాలన్నింటిలోకి ధనవంతుడయిన ఆసామి చనిపోయాడని తెలియగానే భీముడు ఎగిరి గంతేశాడు. అతణ్ణి పూడ్చిపెట్టడం కూడా జరిగిపోయిందని తెలియగానే మహదానందపడ్డాడు. అప్పటికప్పుడు శ్మశానంలో ఆ శవాన్ని చూసొచ్చినట్లు భీముడు నాలుగైదు సార్లు పగటికలలు కన్నాడు.

చింతచెట్టు కింద కూచుని ఆడుకుంటున్న తన కూతురు నబ్జాను, లోపల వంట చేస్తున్న భార్యను ప్రేమగా చూసుకున్నాడు. సూర్యాస్తమయం కోసం ఎదురుచూస్తూ ఆ రోజు ఒక పట్టాన చీకటి పడడం లేదే అని అనుకున్నాడు.

పేరుకు తగ్గట్టుగానే భీముడిది భారీ శరీరం. ముతక ధోవతి, చొక్కా, ఎర్ర రుమాలుతో కనిపించే భీముడు చూసే వాళ్ళకు మల్లయోధుడిలా కనిపిస్తాడు. పెద్ద తల, చిన్న మెడ, విశాలమైన ఛాతీ, ఒత్తుగా పెరిగిన కనుబొమలు, వడి తిరిగిన మీసాలతో మోటుగా కనిపిస్తాడు. దేనికీ భయపడడు.

భీముడిది వార్నానది ఒడ్డున వున్న పల్లెల్లో ఓ చిన్న పల్లె. స్వంత వూర్లో జరుగుబాటు లేక బొంబాయి వెళ్ళాడు. అక్కడ అతని బలం, శరీర సౌష్టవం చూసి ఎవరూ పని ఇవ్వలేదు. విసిగిపోయి నగరపు పొలిమేరల్లో వున్న మరో చిన్న గ్రామానికి వెళ్ళాడు. అక్కడ క్వారీ వర్కర్‌గా రాళ్ళు కొట్టే పనికి కుదురుకున్నాడు. బొంబాయిలో డబ్బు సంపాయించి, భార్యకు బంగారు గొలుసు చేయించాలన్న వాడి ఆలోచన బూడిదలో పోసిన పన్నీరే అయ్యింది. నగరం మహా క్రూరమైంది. అక్కడ స్వర్గ సుఖాలు దొరుకుతాయి. కాని తలదాచుకోవడానికి ఇంత నీడ దొరకదు. చేయడానికి పని దొరకదు. నగరమంటే భీముడికి ద్వేషం ఏర్పడింది. అందుకే విధిలేక పొలిమెరల్లో వున్న చిన్న గ్రామంలో స్థిరపడ్డాడు. రాళ్ళు కొట్టగా వచ్చిన డబ్బుతో సంసారాన్ని బొటాబొటిగా లాక్కొస్తున్నాడు. అతని కండబలానికి రాళ్ళ గుట్టలు దాసోహమన్నాయి. అతని సుత్తి దెబ్బకు రాళ్ళు పప్పు పప్పయ్యాయి. పని చూయించిన క్వారీ కాంట్రాక్టరు మనసు ప్రసన్నమైంది. భీముడికీ సంతోషంగా కాలం గడిచింది. అయిదు నెలలు గడిచిందో లేదో క్వారీ మూతబడింది. భీముడికి పనిలేకుండా పోయింది. పని లేకపోవడం కన్నా, పనిలేదేనన్న ఆలోచన భీముడికి భయంకరంగా తోచింది. తను, తనకుటుంబం తిండిలేక మలమల లాడాల్సి వస్తుందన్న ఆలోచన ఎక్కువ భయపెట్టింది.

ఓరోజు భీముడు నది ఒడ్డున స్నానం చేసి, ఇంటికి తిరిగి వస్తున్నాడు. దారిలో కుప్పలు తెప్పలుగా బూడిద కనిపించింది. పరీక్షగా చూస్తే, అందులో అక్కడక్కడ ఎముకలు కనిపించాయి. అది శవాన్ని కాల్చేసిన బూడిద అని గ్రహించడానికి భీముడికి ఎంతో సమయం పట్టలేదు. అతడు భయపడలేదు. పనీపాట లేని తనలాంటి నిర్భాగ్యుడెవడో చనిపోయి వుంటాడు. చావు ఒడిలో హాయిగా తలదాచుకొని వుంటాడు అని అనుకున్న భీముడు చావు అనే భావనతో చలించిపోలేదు. కానీ బీదతనపు క్రూరత్వాన్నే భరించలేక పోతున్నాడు. తిండిలేక ఏడుస్తున్న తన కూతుర్ని, నిస్సహాయంగా కుమిలిపోతున్న భార్యని గుర్తుచేసుకుని తల్లడిల్లిపోయాడు. అనుకోకుండా బూడిద కుప్పలో ఏదో మెరుస్తూ కనిపించింది. భీముడు దగ్గరికి వెళ్ళి చూసాడు. అదొక బంగారు ఉంగరం. మరో ఆలోచన లేకుండా వెంటనే అందుకున్నాడు. అది సుమారు పన్నెండు గ్రాములుంటుంది. ఆవిధంగా స్మశానపు బూడిదలో దొరికిన బంగారు ఉంగరం భీముడి జీవితంలో కొత్త ద్వారాలు తెరిచింది. జీవనోపాధి చూపించింది. ఆకలిని తరిమేసే అద్భుత శక్తిని ఇచ్చింది.

మరునాటి నుండి భీముడు స్మశానంలో తిరుగుతూ, బంగారం కోసం వెతకడం ప్రారంభించాడు. సెమిట్రీలో సమాధులు తవ్వడం ప్రారంభించాడు. బూడిదంతా కెలకటం, బంగారపు ముక్కలు ఏవైనా కనబడితే ఏరుకోవడం చేస్తున్నాడు. ఓరోజు చెవిపోగు, ఓరోజు ముక్కు పుడక వడ్డాణపు తునక, లేదా హారపు ముక్క ఏదో ఒకటి దొరుకుతూ ఉండేది. ఒక్కోసారి ఏదీ దొరక్క ఉట్టి చేతులతో ఇంటి ముఖం పట్టాల్సి వచ్చేది. శవంతో పాటు వదిలేసిన బంగారు ఆభరణాలు, వెండి నగలు చితి మండినపుడు కరిగిపోయి బూడిదలో చిన్న చిన్న ముద్దలుగా, బిళ్ళలుగా మిగులుతూ ఉండేవి. భీముడు అవి జాగ్రత్తగా ఏరుకుని తెచ్చుకునేవాడు. ఒక్కోసారి బంగారం కరిగి విరిగిన ఎముకల్లోకి జారేది. అలాంటప్పుడు భీముడు నిర్దాక్షిణ్యంగా ఎముకలు




విరిచి, కపాలాలు పగులగొట్టి బంగారం చేజిక్కించుకునేవాడు. విలువైన లోహం కదా! ఏ పనైనా చేయించేది. ఎప్పటికప్పుడు, దొరికిన బంగారం బొంబాయి దగ్గర కర్లాకు వెళ్ళి, అమ్మి, డబ్బులు తెచ్చుకునేవాడు. ఇంటికి కావాల్సిన సామానుతో పాటు తన కూతురు అడిగే పూసలు, దారాలు, రిబ్బన్లు, పిన్నులు కూడా తెచ్చేవాడు.

భీముడి జీవితం ఓ మోస్తరుగా దొర్లిపోతోంది. చేసే పనిలో మంచి చెడ్డా గురించి వాడికి ఆలోచన లేదు. బతకడం, చావడం మధ్య గల వ్యత్యాసం అతనిపై ఏ ప్రభావం చూపదు. కాని వాడికి ఒకటి మాత్రం చాలా ఖచ్చితంగా తెలుసు. ధనవంతుడి చితిలో బంగారం దొరుకుతుందని, దౌర్భాగ్యుడి చితిలో బూడిద తప్ప, ఏమీ వుండదని, ధనవంతులు ఎక్కువగా చస్తూ వుంటే పేదవాళ్ళకు బతికే అవకాశం ఎక్కువగా ఉంటుందని వాడికి మరో కొత్త ఆలోచన కూడా వచ్చింది. బానిసత్వంలో తన లాంటి జీవులకు బతికే హక్కుగాని, చచ్చే హక్కుగాని వుండదని వాడికి అనిపించింది. రాత్రింబవళ్ళు వాడికి ఇక అదే ధ్యాస. స్మశానాలు, సమాధులు పని స్థలాలయ్యాయి. శవాలు వాడి బతుకును అల్లుకున్నాయి.

ఆ రోజుల్లో రోజుకో వింత వార్త ప్రజల్ని భయపెట్టేది. సమాధి చేసిన శవాలు పైకి లేచాయని. ఒకానొక ధనవంతుడి కోడలి శవం స్మశానం నుండి కదిలిపోయి కాలువ ఒడ్డున పడివుందని, దయ్యాలు తిరుగుతున్నాయని, పిశాచాలు వ్యాపించాయని ఎన్నో ఎన్నో.... సాయంత్రం కాగానే జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్లలో దూరుతున్నారు. పోలీస్ ఎలర్ట్ అయ్యింది. కాని, శవాల్ని ఎవరు మాత్రం కాపలా కాయగలరు? రాత్రంతా సమాధుల్ని చూస్తూ ఎవరు కాచుకోగలరు?

సూర్యాస్తమయం - అయ్యింది. చీకటి



చిక్కనవుతూ ఉంది. భార్య వడ్డిస్తుండగా భీముడు సుష్టుగా భోంచేశాడు. భోజనం తర్వాత ఎక్కడికి వెళ్తాడో..... ఆమెకు బాగా తెలుసు. రోజులు బాగా గడుస్తున్నా చేస్తున్న పనిమీద ఆమెకు సదభిప్రాయం లేదు. ఎన్నోసార్లు చెప్పి చూసింది కూడా. మళ్ళీ ఈ రోజు ఆ ప్రసక్తే తెచ్చింది.

"ఈ పని నువ్వు మానేయకూడదా? మరేదైనా పని చేసుకుని బతికితే గౌరవంగా ఉంటదయ్యా! ఊళ్ళో వాళ్ళంతా మన గురించి అప్పుడే చెడుగా మాట్లాడుకుంటున్నారయ్యా" అని ఉంది. భీముడు ఉన్న ఫళాన కోపంతో ఎగిరి పడ్డాడు.

"నోర్ముయ్! ఎక్కువగా మాట్లాడావంటే పళ్ళు రాలగొడతా..... ఏమనుకున్నావో! ఎవడే ముద్ద పెట్టేవాడు. ఎవడే తిండి పెట్టేవాడు. ఎవడో ఏదో మాట్లాడుతున్నాడని నా పని మానుకోవాలా? అదేం లేదు. నా ఇష్టం వచ్చినట్లు నేను చేస్తాను."

"అది కాదయ్యా, నువ్వు మరో విధంగా అనుకోవద్దు. మనమూ మనుషులమే. దయ్యాలు శవాల్ని పీక్కుతిన్నట్లుగా ఇదేం పనయ్యా. మన ఖర్మకూ? నువ్వు ప్రయత్నిస్తే నీకు మరేదైనా మంచి పని దొరుకుతుందని అంటున్నాను. అంతే. నువ్వు ఈ పని చేస్తుంటే నాకు చచ్చేంత భయంగా ఉంది."- అంది భార్య.

"పిచ్చి మొహందానా! ఎవరే నీకు చెప్పింది. స్మశానాల్లో దయ్యాలు తిరుగుతాయనీ? ఇదిగో ఈ బొంబాయి ఉందే, ఇదొక దయ్యాల పుట్ట. బతికే దయ్యాలు ఇళ్ళల్లో ఉంటాయి. చచ్చినవి సమాధుల్లో అంతే. పిశాచి గణమంతా ఈ నగరంలోనే వుంది. అడవిలో ఎందుకుంటాయే?" అని వంకర నవ్వులు నవ్వాడు భీముడు. ఆమె మరి మాట్లాడలేదు. బయటకి వెళ్ళడానికి భీముడు అన్నీ సిద్ధం చేసుకున్నాడు. తను కడుపుచేత పట్టుకుని బొంబాయంత తిరిగినపుడు ఉద్యోగం కాదుగదా, కనీసం చిన్న చిన్న పనులైనా దొరకలేదని. రోజంతా రాళ్ళు పగలేసినా రెండు రూపాయలు రావడం గగనమయ్యేదనీ భార్యకు గతాన్ని జ్ఞాపకం చేశాడు. స్మశానంలోని బూడిద తనకోసం బంగారం పండిస్తుంటే ఎందుకు కాదనాలి? - అని కోపంగా ఇంట్లోంచి బయటపడ్డాడు. బయటపడి, చుట్టూ పరికించాడు. అంతా ప్రశాంతంగా ఉందని గ్రహించాడు.

భీముడు తలమీద ఒక గుడ్డ పీలిక వేసుకున్నాడు. దానిమీద గోనెసంచి ముసుగు పెట్టాడు. చంకలో ఇనుప గునపం దాచిపెట్టుకుని, పెద్ద పెద్ద అడుగులు వేస్తూ పక్క ఊరికి ప్రయాణమయినాడు. అమావాస్యనాటి కటిక చీకటి ఎక్కడ ఏమీ కనిపించడం లేదు. అయినా భీముడు అలవాటయిన దారిలో సాఫీగా నడిచిపొయ్యాడు. తిండీ బట్టా ఎలాగూ బాగానే నడుస్తోంది. కాస్తా డబ్బులున్నప్పుడు ఈసారైనా భార్యకు, కూతురుకి నగలు చేయించాలని అనుకున్నాడు.

చీకటి, నిశ్శబ్దం కలిసి, వాతావరణాన్ని భయంకరంగా చేశాయి. దూరంగా తోడేళ్ళ అరుపులు, చల్లగాలికి బయట తిరుగుతున్న పాము, అరుస్తున్న గుడ్లగూబలతో చీకటి మరింత ప్రమాదకరంగా అయ్యింది. భీముడు చేరుకోవాల్సిన ఊరు చేరుకున్నాడు. ఊరు నిద్రపోతోంది. ఎక్కడా ఎవరో దగ్గడం తప్పించి, దీపం ఒకింత వెలిగి ఆరిపోవడం తప్పించి, భీముడికి ఆటంకాలేవీ లేవు. అంతా సద్దుమణిగే ఉంది. సంతృప్తి కలిగేదాకా పరిశీలించి, భీముడు ఊరి బయట సిమెట్రీలో ప్రవేశించాడు. నిన్న పూడ్చేసిన కొత్త సమాధిని అన్వేషించడం ప్రారంభించాడు. చీకట్లో కనిపించక ఇటునుండి అటు, అటునుండి ఇటూ గెంతుతూ మట్టి కుండల్ని పగలగొట్టాడు. వెదురు కర్రల్ని విరగ్గొట్టాడు. ప్రతి సమాధి దగ్గర అగ్గిపుల్ల వెలిగించి చూస్తూ, జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. కొత్తగా పాతిపెట్టిన ధనవంతుడి శవం కోసం ఆ గాలింపు! కొంత సేపటి తర్వాత చల్లగాలి వీచింది. ఆకాశంలో మెరుపులు కనిపించాయి. ఉరుములు వినిపించాయి. వర్షం కురుస్తుందేమోనని అనిపించింది. భీముడు భయపడ్డాడు. వర్షం పడితే కొత్తగా శవాన్ని సమాధి చేసిన చోటు గుర్తుపట్టడానికి వీలుకాదు. తను వచ్చిన పని కాదు.


చివరకు భీముడు కొత్త సమాధిని కనుక్కోగలిగాడు. అయితే ఆ మరుక్షణమే గుండెలదిరి నోరు తెరిచాడు. ఊపిరి తీయడం మరిచి నిలబడ్డాడు. దగ్గర్లో ఎవరో పళ్ళు కొరుకుతున్న చప్పుడు వినిపించింది. చీకట్లో ఏ ఆకారమూ స్పష్టంగా లేదు. కాని నేలమీద ఎవరో పాకుతున్న చప్పుడు, గోళ్ళతో రక్కుతున్న చప్పుడూ వినిపించింది. భీముడికి అలాంటి పరిస్థితి ఎప్పుడూలేనిది ఈసారి ఎందుకో భయం వేసింది. దయ్యాలో, పిశాచాలో అయివుంటాయా? ఎటూ తేల్చుకోలేక కదలకుండా నిలబడ్డాడు. కొద్దిసేపటికి ఎవరో వెనక నుండి తంతున్నట్టు అయ్యింది. దాంతో పై ప్రాణాలు పైనే పొయ్యాయి. భయంతో గుండె ఆగినంత పనయ్యింది. ఆరోజు అన్నీ విచిత్రాలే జరుగుతున్నాయేమోనని అనిపించింది. ధైర్యం తెచ్చుకుని, నిశితంగా చూసేసరికి...... అప్పటిదాకా భయపడ్డందుకు తనమీద తనకే జాలి కలిగింది. నేలమీద ఉన్నది తోడేళ్ళ గుంపు. శవం కోసం అవి ఆ కొత్త సమాధి దగ్గర గుమిగూడాయి. సమాధి చుట్టూ పాతిన రాళ్ళను తాకకుండా పక్కనుండి నేరుగా శవం దాకా సొరంగం లాంటిది తవ్వాలని ప్రయత్నిస్తున్నాయి. మాంసం వాసన పసిగట్టి అవి అక్కడ చేరనైతే చేరాయిగాని, ఒకదాన్ని కాదని మరోటి ముందుకు దూకుతుండడంతో పోట్లాడ మొదలైంది. ముక్కులు భూమిమీద పెట్టి వాసన చూస్తూ తవ్వడంలో నిమగ్నమై వున్నాయివి. భీముడికి పిచ్చి కోపం వచ్చింది. ఒక్కసారి ఎగిరిగంతేసి, సమాధి మీద రాళ్ళమధ్య నిలబడ్డాడు.



పెద్ద పెద్ద రాళ్ళు తీసి, తోడేళ్ళ మీదికి విసిరేయడం ప్రారంభించాడు. ఊహించని ఈ పరిణామానికి అవి బెంబేలు పడి దూరంగా పారిపోయ్యాయి.

భీముడికి పరిస్థితి అనుకూలంగా మారింది. తోడేళ్ళ కంటే ముందే వాడు శవాన్ని బయటకి తీయాలనుకున్నాడు. త్వరత్వరగా తవ్వడం ప్రారంభించాడు. తోడేళ్ళు కూడా చాలా తెలివిగలవి. భీముడు పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు అకస్మాత్తుగా వచ్చి మీద పడ్డాయి. పైన కప్పుకున్న గోనె సంచి ముసుగు లాగేశాయి. భీముడు అదిలించాడు. అవి దూరం వెళ్ళినట్టే వెళ్ళి మళ్ళీ వేగంగా వచ్చి వెనకనుండి కుమ్మాయి. ముసుగు చింపేశాయి. చిరిగిన గోనెసంచి ముక్కలు పదునైన వాటి పళ్ళకు వ్రేలాడాయి. భీముడికి చిర్రెత్తుకొచ్చింది. చేతిలో వున్న గునపం గురిచూసి విసిరాడు. ఓ తోడేలు దెబ్బకు చచ్చింది. ప్రమాదమేదో జరిగిపోయిందని మిగిలినవన్నీ పారిపొయ్యాయి. చచ్చిన జంతువును ఓ పక్కకు లాగి, భీముడు మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యాడు. కాసేపట్లో పని పూర్తవుతుందనగా మరిన్ని తోడేళ్ళు ఎక్కువ సంఖ్యలో అన్ని వైపుల నుండి వచ్చి మీద పడ్డాయి. ఈసారి వాడికి నిజంగానే శక్తి ఉపయోగించాల్సి వచ్చింది. రాళ్ళతో, గునపంతో హోరాహోరీ పోట్లాడవలసి వచ్చింది. ఒక్కో గుద్దుకు ఒక్కో తోడేలు కింద పడుతోంది. కాని మిగతావి మీదపడి రక్కుతున్నాయి. మాంసం లాగేసేట్లున్నాయి. తమలో ఒక తోడేలు చావడం అవి భరించలేకపోతున్నాయి. తమను తాము రక్షించుకోవడానికి కట్టగట్టుకుని వచ్చి, ఐకమత్యంగా పోరాడుతున్నాయి.

భారతంలో కుంతీపుత్రుడు భీముడి పేరు పెట్టుకున్నందుకు ఈ భీముడు కూడా బలశాలిగానే వున్నాడు. అలాగే ఊరి బయట సమాధులు మధ్య జరుగుతున్న ఈ తోడేళ్ళయుద్ధంలో శాయశక్తులా ఒంటరి వీరుడిగా పోరాడుతున్నాడు. కేవలం ఆకలి కోసమే మనిషి-జంతువుతో నిర్దాక్షిణ్యంగా పోరాడిన ఈ యుద్ధం గూర్చి ఈ దేశపు చరిత్రలో ఎక్కడా నమోదు కాలేదు. మనిషి బంగారం కోసం, జంతువులు ఆహారం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఆ స్మశాన యుద్ధం చివరకు ఎలాగో ముగిసింది. తోడేళ్ళు దెబ్బలు తిని పారిపొయ్యాయి. కాని భీముడికి వంటినిండా గాయాలయ్యాయి. దూరంలో




బొంబాయి నగరం మగతగా నిద్రపోతున్నట్లు లైట్లు మినుకుమినుకు మంటున్నాయి. కనుచూపు మేరలో వున్న గ్రామం కూడా గాఢనిద్రలో ఉన్నట్లుంది.


చాలా సేపటికి మామూలు పరిస్థితి నెలకొంది. తోడేళ్ళు మళ్ళీ రాలేదు. భీముడికి కొంత సమయం దొరికింది. తవ్వడం మళ్ళీ కొనసాగించాడు. వదులుగా పొడిపొడిగా వున్న మట్టి తవ్వి పోశాడు. శవం దాదాపు బయటకి కనిపిస్తోంది. ఇంకొంచెం మట్టితీస్తే సరిపోతుంది. మధ్యమధ్యలో భీముడు నుదిటి మీది చెమటను తుడిచేసుకుంటున్నాడు. అప్పటికే పూర్తిగా అలసిపోయిన భీముడు, కాసేపు ఊపిరి పీల్చుకుందామనుకున్నాడు. కాని మరో తోడేళ్ళ గుంపు మరోమారు మీద పడింది. శక్తినంతా కూడదీసుకుని, భీముడు మళ్ళీ పోట్లాడాడు. తోడేళ్ళను బెదిరించి పంపాడు.

భీముడు అతికష్టంమీద శవాన్ని బయటికి లాగాడు. అగ్గిపుల్ల గీసి, శవాన్ని పరీక్షగా చూశాడు. అతను బతికుండగా అతని పేరు వినడం తప్ప ఎప్పుడూ అతని ముఖమైనా చూడలేదు. ఇప్పుడు నిస్సహాయంగా తన చేత చిక్కాడు. ఈ ధనికుడి శవం పూడ్చిపెట్టారన్న వార్త తెలిసినప్పుడు ఎంత సంతోషించాడో, ఆ సంతోషాన్ని నిజం చేసుకోవడానికి తను ఎంత సంఘర్షించాడో ఊహించుకుంటే ఎంతో గొప్పగా ఉంది. కాని సమయం లేదు. వీలైనంత త్వరగా పని ముగించుకుని బయటపడాలి. బిర్రబిగుసుకు పోయిన శవాన్ని పైనుండి కిందికి వెతికాడు. కల నిజమైందన్న ఆనందంలో వెతికాడు. శవం చేతివేళ్ళలో ఓ చేతికి బంగారు ఉంగరం కనిపించింది. అది తీసి జేబులో వేసుకున్నాడు. చెవులకున్న బంగారు రింగులను తెంపుకున్నాడు. శవం నోట్లో కూడా బంగారం దొరకొచ్చునని ఊహించాడు. వేళ్ళతో శవం నోరు తెరవడానికి ప్రయత్నించాడు. శవం దవడలు బిగ్గరగా బిగుసుకుపోయి వుండడం వల్ల, పళ్ళు గట్టిగా మూసుకుని వున్నాయి. ఇనుపగునపంతో సందుచేసి దాన్ని శవం దవడల మధ్య గుచ్చాడు. శవం నోరు తెరుచుకుంది. నోట్లోకి తన వేళ్ళు పోనిచ్చాడు. సరిగ్గా ఆ సమయానికే అడవిలో తోడేళ్ళు బిగ్గరగా అరిచాయి. ఆ అరుపులకు ఊళ్ళోని కుక్కలు మేల్కొని అరవడం మొదలు పెట్టాయి. కుక్కల అరుపులకు ఊళ్ళోని మనుషులు లేచారు.

శవం నోట్లో మరో బంగారు ఉంగరం దొరికింది. తీసి జేబులో వేసుకున్నాడు. మరోసారి నోరంతా కలియబెట్టి చూడడానికి భీముడు మళ్ళీ తన ఎడమచేతి వేళ్ళు దూర్చాడు. కాని ఏమీ తగలలేదు. ఊళ్ళోని జనం కొంతమంది లేచి, ఊరి బయటి దాకా వచ్చారు. సిమెట్రీలోని తోడేళ్ళను బెదరగొట్టడానికి మరికొంతమందిని కేకేసి లేపుతున్నారు. అది విన్న భీముడికి వెన్నులో వణుకు ప్రారంభమైంది. ఏం చేయాలో పాలుపోలేదు. ఆ భయంలో తన చేతివేళ్ళు బయటకి తీసుకోకుండానే శవం నోట్లోంచి ఇనుప గునపం బయటకి లాగాడు. అంతే వేళ్ళు పళ్ళకింద నలిగిపొయ్యాయి. ఇనుపయంత్రం పళ్ళలో చేయి ఇరుక్కుపోయినట్లయింది. విపరీతమైన బాధ. కాని, అరిచే పరిస్థితి లేదు. శరీరమంతా నరాలు పీక్కుపొయ్యాయి. లాంతర్లు వేసుకుని గ్రామస్తులు సిమెట్రీవైపు వస్తున్నారు. వస్తే, వస్తే ఇంకేముంది? వాళ్ళు ఇన్నిరోజులు దయ్యం, పిశాచం అని భయపడుతున్నది తన వల్లనే

అని తెలుసుకుంటారు. మీద పడి చచ్చేదాకా చావబాదుతారు. ఇంకా బతికుంటే పోలీసులకు అప్పగిస్తారు.... జరగబోయేది ఊహించుకోగానే బలశాలి భీముడి జవసత్వాలు పూర్తిగా చచ్చిపొయ్యాయి. మరోవైపు

శవంపై పిచ్చి కోపం వచ్చింది. గునపంతో దానిపుర్రె మీద ఒక్కపోటు పొడిచాడు.. దాంతో శవం దవడ ఎముకలు బిరుసెక్కి, భీముడి వేళ్ళను కత్తిరించాయి. బాధ భరించలేక అసహాయంతో, భయంతో, కోపంతో భీముడు తల్లడిల్లిపోయాడు. తనను పిశాచంలా పట్టుకున్న శవాన్ని తిట్టుకుంటూ, శపించుకుంటూ గునపంతో దాన్ని కుళ్ళబొడిచాడు.




అప్పటికే జనం సిమెట్రీ దరిదాపులకు చేరుకుంటున్నారు. భీముడు మళ్ళీ గునపం శవం నోట్లో దూర్చాడు. దాని నోరు తెరుచుకుంది. చచ్చుపడి వున్న తన రెండు వేళ్ళను నిదానంగా బయటకి లాక్కున్నాడు. అవి పూర్తిగా తెగినుగ్గునుగ్గయి చర్మంలో వేలాడుతున్నాయి. వంటి నిండా గాయాలు, ఆపై తెగిన చేతివేళ్లు కారుతున్న రక్తం, విపరీతమైన బాధ - భీముడి పరిస్థితి ఏ క్షణంలోనైనా కుప్పగూలిపోయేట్లుగా ఉంది. కాని ఒక్క క్షణం కూడా ఆలస్యం చేసేట్లు లేదు. తెగిన వేళ్ళు అరచేతిలో పెట్టుకుని చీకట్లోకి జారుకున్నాడు.

భీముడు ఎలాగో ఇల్లు చేరనైతే చేరాడు. కాని అతని పరిస్థితి చూసి భార్య లబోదిబోమంది. కూతురు కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. భీముడికి ఎప్పుడూ రానంత జ్వరం వచ్చింది. వాడు ప్రాణాలతో బతికి బయటపడ్డాలంటే వెంటనే ఆ రెండు వేళ్ళూ నరికివేయాలని సర్జన్ నిర్ణయించాడు.

వేళ్ళు తీయించుకుని భీముడు ఇల్లు చేరిన మరునాడే క్వారీపని మళ్ళీ మొదలవుతోందని తెలిసింది. ఉక్కు పిడికిళ్ళతో కొండల్ని లొంగదీసుకోగల భీముడు నిస్సహాయంగా చిన్న పిల్లాడిలా ఏడ్చాడు.

# అనుభూతి

హృదయాన్ని హుండీలా బోర్లించి
అనుభూతుల నాణేలు ఏరుకొందామని
కాలాన్ని చాపలా పరచిన ప్రతిసారీ
చిల్లర నాణేలు చిత్తు కాగితాలే దర్శనమిస్తాయి
ఆరు ఋతువుల గాఢ పరిష్వంగనలో
అరవై వసంతాల జీవితం నాకేమి మిగిల్చలేదనే బాధలో
అరచేతిని ఆసరాగా పెట్టి
ఆకాశంకేసి తల త్రిప్పుతానా
అక్కడ నక్షత్రాల్ని ప్రక్కకు నెట్టుకుంటూ
తూరుపు దీపమై ప్రకాశిస్తుంది ఆ ఉత్తరం ముక్క
చూపులు చేతులై దాన్ని ముట్టుకున్న మరుక్షణం
నా రక్తనాళాలు జలపాతాలవుతాయి
ఎప్పుడో ఎగిరిపోయిన యవ్వనం
గువ్వలా తిరిగి రావడం చూసి
ముడతలు పడ్డ నా ముఖంపై
విజయ దరహాసమేదో పరవళ్ళుత్రొక్కేది
ఆ ఉత్తరం అక్షరాల్ని పొదిగిన కాగితం కాదు
నక్షత్రాల్ని పేర్చిన ఆకాశం
ఏ వనమయూరపు ఆరంగేట్రమో మనసున మల్లెలు
పూయిస్తే
మార్గశిర మేఘ మాలికలేవో ప్రశంసల వర్షం కురిపించినట్లు
నూనూగు మీసాల నా నూత్న యవ్వనం
తన కళ్ళ లెన్సులు దాటి
హృదయఫలకంపై మోహాక్షరాలు లిఖించినట్టు
ఓ జీవితకాల అనుభూతిని నాకు మిగిల్చిన లేఖ

మహమ్మద్ రఫీ

